క్లుప్తంగా

ముగిసిన శిక్షణా తరగతులు

రాజాం/రేగిడి/బాడంగి: వృత్యంతర శిక్షణలో భాగంగా మండలాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న శిక్షణా తరగతులు శనివారంతో ముగిశాయి. చివరి రోజు కార్యక్రమానికి ఐసీడీఎస్ పీడీలు, పీవోలు, సూపర్‌వైజర్లు హాజరై, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రీస్కూల్ బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలు, చిన్నారులకు నాణ్యమైన విద్య, మెరుగైన ఆరోగ్యం అందించేందుకు పాటించాల్సిన విధానాలను తెలిపారు. శిక్షణలో నేర్చుకున్న ప్రతి అంశాన్ని కేంద్రంలో వినియోగించాలని, అలాంటప్పుడే మనం ఆశించిన లక్ష్యం నెరవేరుతుందన్నారు.

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు

రామభద్రపురం: ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద గొల్లాది ఆటో యూనియన్ సభ్యులు ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు శనివారం ప్రారంభించారు. అటువైపుగా వెళ్తున్న పాదచారులకు మజ్జిగ, తాగునీరు ఎంపీపీ అందించారు. ప్రయాణికులు, పాదచారుల దాహార్తి తీర్చేందుకు ఈ చలివేంద్రం ఏర్పాటు చేశామని, అందరూ ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

భూ సమస్యల పరిష్కారానికి కృషి

మెంటాడ: భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తహసీల్దారు కోరాడ శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ప్రత్యేక గ్రీవెన్స్ శనివారం నిర్వహించగా, మండలంలో రీసర్వే జరగని గ్రామాల నుంచి 80 మంది రైతులు తమ సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రాలు సమర్పించారు. క్షేత్రస్థాయిలో పరిశీలన అనంతరం సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దారు సమాధానమిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అన్నసత్రాన్ని సందర్శించిన టీటీడీ ప్రధానార్చకులు



అన్నదాన కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న గోవిందస్వామి దీక్షితులు

రేగిడి: మండలంలోని వావిలవలస గ్రామంలో సామాజిక కార్యకర్త పాలూరి సిద్ధార్థ నిర్వహిస్తున్న అన్నసత్రాన్ని టీటీడీ ప్రధానార్చకులు గోవిందస్వామి దీక్షితులు శనివారం సందర్శించారు. సత్రం నిర్వహణ, సత్రంలో అందిస్తున్న భోజనాలపై ఆరాతీశారు. నిరుపేదలకు సిద్ధార్థ అన్నదానం చేయడాన్ని ఆయన అభినందించి, ప్రోత్సహించారు. అనంతరం గ్రామంలోని పురాతన రంగనాథస్వామి ఆలయాన్ని సందర్శించారు.

చిరుధాన్యాల సాగుతో భూసారం వృద్ధి

వంగర: చిరుధాన్యాల సాగుతో భూసారం వృద్ధి చేసుకోవచ్చని ఏపీ సీఎస్ఎఫ్ అడిషనల్ డీపీఎం ఆర్.వి.స్వామినాయుడు తెలిపారు. మండల కేంద్రంలో స్థానిక రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఆధ్వర్యంలో గ్రామైక్య సంఘాల అధ్యక్షులు, వెలుగు సిబ్బందితో శనివారం సమావేశమైన ఆయన.. ఖరీఫ్ సీజన్‌కు ముందు పెసర, మినుము, కూరగాయలు, ఆకుకూరలు, కొర్రలు, రాగులు, అలసందలు, సామలు వంటి పంటలు సాగు చేసుకోవాలన్నారు. ఈ పంటల సాగుతో నేలలో సూక్ష్మజీవుల వృద్ధి జరిగి తద్వారా భూసారం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏవో తట్టికోట కన్నబాబు, ఏపీఎం టి.మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా 'ఉల్లాస్' పరీక్ష

వంగర/బొబ్బిలి/బాడంగి: మండలాల్లోని అన్ని గ్రామాల్లో ఆదివారం నిర్వహించే ఉల్లాస్ పరీక్ష పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీవోలు లోపింటి త్రినాధ్, పోతుల రవికుమార్, ఎస్.రామకృష్ణలు సూచించారు. ఇదే విషయమై వారు మండల కేంద్రాల్లోని వెలుగు కార్యాలయాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, సీసీలు, వీవోఏలు, గ్రామైక్య సంఘాల అధ్యక్షులతో శనివారం సమావేశమై పలు సూచనలు చేశారు. నిరక్షరాస్యులైన మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడంలో భాగంగా మూడు నెలల పాటు ఉల్లాస్ శిక్షణా తరగతులు నిర్వహించడం జరిగిందని, ప్రస్తుతం దానికి సంబంధించి పరీక్ష జరుగుతోందన్నారు. పరీక్ష పక్కాగా జరిగేలా చూడాలని ఎంపీడీవోలు తెలిపారు.

సారా రహిత గ్రామాలే లక్ష్యం

బొబ్బిలిరూరల్: మండలంలోని కొయ్యికొండవలస గ్రామంలో సారా నియంత్రణపై శనివారం అవగాహన కల్పించారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా సారా రహిత గ్రామాలే లక్ష్యంగా పనిచేస్తున్నామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ పామోటి చిన్నంనాయుడు తెలిపారు. అనంతరం సారా తాగడం వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించారు. సారా తాగితే జీవితం అధోగతి పాలవుతుందని, మానితే పురోగతి సాధ్యమన్నారు. సారా తయారు చేసినా, విక్రయించినా, రవాణా చేసినా సమాచారం ఇవ్వాలని సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. సారా లేకుండా చేసే ఈ కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు.



జీఎంఆర్ ఐటీ రోడ్డులోనే చెరువు గట్టుపై ఆక్రమణలు ఇలా..



రాజాం వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద అక్రమంగా షాపుల నిర్వహణ



పాగిరి పీహెచ్‌సీ వద్ద రోడ్డుపైనే ఉన్న అక్రమ నిర్మాణాలు

ఖాళీ జాగా.. వేసేయ్ పాగా!

- యథేచ్ఛగా ప్రభుత్వ స్థలాల ఆక్రమణలు
- ప్రధాన రోడ్లు ఆనుకుని అక్రమంగా నిర్మాణాలు
- పలుచోట్ల పక్కా గదుల నిర్మాణం
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న రెవెన్యూ యంత్రాంగం

రాజాం: పట్టణంలో ఖాళీ జాగా కనిపిస్తే చాలు.. ఆక్రమణదారులు గద్దల్లా వాలిపోతున్నారు. ఆక్రమించుకుని, అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారు. ముఖ్యంగా ప్రధాన రహదారుల పక్కన ఉన్న ప్రభుత్వ స్థలాలే అధికంగా ఆక్రమణకు గురవుతున్నాయి. ఆక్రమణలు చేసే వారు ఒకరైతే.. వాటిలో నిర్మాణాలు చేసేవారు మరొకరు.. అందులో అద్దెకు వ్యాపారాలు చేసేవారు ఇంకొకరు. రాజకీయ పలుకుబడి ఉండే చోటామోటా నాయకులు, కార్యకర్తలే ఈ ఆక్రమణల్లో ముందంజలో ఉండగా, వారికి కొంత సొమ్ము ముట్టజెప్పి, షాపులు, చిన్నచిన్న బడ్డీలు పెట్టుకోవడం వాటిని అద్దెకు ఇవ్వడం మరొకరి వంతుగా మారింది. రాజాం ప్రధాన రహదారి విస్తరణ తర్వాతే ఈ ఆక్రమణలు అధికమవుతున్నాయి. అయినా రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఫుట్‌పాత్‌నూ వదలడం లేదు..

రాజాం పట్టణంలోని శ్రీకాకుళం, బొబ్బిలి ప్రధాన రహదారులు ఆక్రమణలతో నిండిపోతున్నాయి. అంబేడ్కర్ జంక్షన్ నుంచి మాధవబజార్ వరకు రోడ్డుకు ఓ వైపున భారీగా ఆక్రమణలు జరిగాయి. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఏరియా ఆస్పత్రి, పశుసంవర్ధక శాఖ కార్యాలయం, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద రోడ్డుకు, కార్యాలయాలకు మధ్య



రాజాం మార్కెట్ రోడ్డులోని ప్రభుత్వ పాఠశాలను ఆనుకుని ఆక్రమణల్లో షాపులు

ఖాళీగా ఉన్న స్థలాలపై బడ్డీ కొట్టులు నిర్వహిస్తున్నారు. రోడ్డు విస్తరణలో నిర్మించిన ఫుట్‌పాత్‌ను కూడా విడిచిపెట్టకుండా షాపులు వెలిశాయి. ఫలితంగా రోడ్డు విస్తరణ జరిగినా ఆక్రమణల కారణంగా రోడ్డు మళ్లీ ఇరుకుగానే మారింది. ట్రాఫిక్ సమస్యలు కూడా ఎక్కువవుతున్నాయి. రాజాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆనుకుని మార్కెట్ రోడ్డులో సైతం ఆక్రమణదారులు నిర్మాణాలు చేసేశారు. ఇదిలా ఉండగా, రాజాం వ్యవసాయ మార్కెట్ యార్డు ముందలి భాగం ఇప్పుడు ఆక్రమణలకు అడ్డాగా మారిపోయింది. ఇక్కడ పెద్ద ఎత్తున ఆక్రమణలు చేసేస్తున్నారు. ముందురోజు చిన్నకర్రలు పాతడం, మరుసటిరోజు బడ్డీకొట్టులు తెచ్చి పాగవేసేయడం జరిగిపోతోంది. కొత్తగా జీఎంఆర్‌ఐటీ రోడ్డులో డోలపేట ప్రభుత్వ, దేవదాయశాఖ భూముల్లోనూ ఆక్రమణలు అధికమయ్యాయి. ఎవరికి నచ్చినట్లు వారు ఈ ప్రాంతంలో ఆక్రమణలకు పాల్పడుతూ పక్కా భవనాలు నిర్మించి, అద్దెలకు ఇచ్చేస్తున్నారు. రాజాం పట్టణ కేంద్రమే కాకుండా ఇటు పాగిరి, అటు బొద్దాం, మరో వైపు కంచరాం ఇలా ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న ఖాళీ స్థలాలన్నీ ఆక్రమణలతో నిండిపోతున్నాయి. ఈ ప్రాంతాల్లో బడ్డీకొట్లు, పక్కా భవనాల నిర్మాణాలు జోరుగా జరుగుతున్నాయి.

చర్యలు తీసుకుంటాం..

రాజాం పట్టణంతో పాటు మండలంలో ఎక్కడైనా ఆక్రమణలు జరిగితే సహించం. ఆక్రమణదారులు ఎంతటి వారైనా చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ స్థలాలు, రోడ్డు పక్కన ఉండే ప్రాంతాల్లో ఆక్రమణలు జరుగుతున్నాయని ఎవరైనా ఫిర్యాదు చేస్తే వెంటనే తక్షణమే చర్యలు చేపడతాం. పాగిరి, కంచరాం, బొద్దాం ప్రాంతాల్లోని ఆక్రమణలపై దృష్టిసారించి, ఆక్రమణదారులకు నోటీసులు అందిస్తాం.

– ఎస్‌కే రాజు, తహసీల్దార్, రాజాం

అధికారుల ప్రోత్సాహం..

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తున్న వారికి మున్సిపల్ అధికారులతో పాటు గ్రామాల్లోని పంచాయతీ, రెవెన్యూ అధికారుల ప్రోత్సాహం పుష్కలంగా ఉంది. బడ్డీకొట్టులు, కిరాణా షాపులు, జిరాక్స్ సెంటర్లు పెడుతున్న వారికి విద్యుత్ మీటరు అవసరం పడుతుంది. ఈ ఆక్రమణదారులకు పంచాయతీ అధికారులు, రెవెన్యూ అధికారులు నో అబ్జక్షన్ సర్టిఫికెట్లు అందిస్తున్నారు. ఫలితంగా వీరికి విద్యుత్ మీటర్లు మంజూరవుతున్నాయి. రోడ్డు విస్తరణ సమయంలోనూ, ప్రమాదాలు జరుగుతున్న సమయంలోనూ విస్తరణ అధికారులు, సర్వేయర్లు వీటిని తొలగించేందుకు చర్యలు చేపడుతున్న సమయంలో ఈ విద్యుత్ బిల్లులు చూపించి, పక్కా హక్కు ఉందనే నెపంతో ఆక్రమణదారులు పాగా వేసిన చోట నుంచి కదలడం లేదు. ఫలితంగా ఒకరిని చూసి మరొకరు ఆక్రమణలు జరిపి వీటిని ఇతరులకు రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు విక్రయాలు చేయడం, ప్రతినెలా రూ.2 వేల వరకు అద్దెలు పొందడం చేస్తున్నారు.

కేజీబీవీల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

రాజాం: మండలంలోని గురవాం గ్రామ కేజీబీవీ(కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయం)లో 2025–26 విద్యా సంవత్సరానికి గాను ఆరు, ఏడు తరగతులతో పాటు ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పల్లి సావిత్రి ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. ఆరో తరగతిలో 40, ఏడో తరగతిలో నాలుగు, ఇంటర్మీడియట్ బైపీసీలో 40 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. అర్హులైన విద్యార్థినులంతా ఏప్రిల్ 11వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, డ్రాపౌట్స్, నో పేరెంట్, సింగిల్ పేరెంట్, బీపీఎల్ కుటుంబాల పిల్లలకు ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుందన్నారు.

రామభద్రపురం: మండలంలోని బూసాయవలస కేజీబీవీలో ఆరో తరగతిలో 40, ఇంటర్మీడియట్ బైపీసీలో 40 సీట్లలో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థినుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ ఎం.దీప తెలిపారు.

బొబ్బిలి: స్థానిక కేజీబీవీలో ఏడు, ఎనిమిది, తొమ్మిదో తరగతుల్లో మిగులు సీట్ల భర్తీకి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ స్వప్న తెలిపారు.

ఫారంపాండ్‌లతో భూగర్భజలాల సంరక్షణ



రేగిడి: లచ్చనవలసలో ఫారంపాండ్‌ల తవ్వకాలను ప్రారంభిస్తున్న వైస్ ఎంపీపీలు అచ్చెన్నాయుడు, జగన్మోహనరావు



మెంటాడ: లోతుగెడ్డలో ఫారంపాండ్‌ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఏపీవో చిన్నప్పయ్య



బొబ్బిలిరూరల్: కుమందానపేటలో ఫారంపాండ్‌ల తవ్వకాలను ప్రారంభిస్తున్న ఎంపీడీవో రవికుమార్

రేగిడి: ఫారంపాండ్‌ల నిర్మాణం వేగవంతం చేయాలని వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు సూచించారు. ఉపాధి హామీ పథకం పనుల్లో భాగంగా మండలంలోని తోకలవలస, లచ్చన్నవలస గ్రామాల్లోని తోటల్లో జరుగుతున్న ఫారంపాండ్‌ల తవ్వకాల పనులను వారు శనివారం ప్రారంభించారు. ఫారంపాండ్‌లలో వర్షపునీటిని ఒడిసిపట్టడం ద్వారా భూగర్భజలాలను సంరక్షించవచ్చని వారు తెలిపారు. నిర్దేశిత కొలతల ప్రకారం ఫారంపాండ్‌ల తవ్వకాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్యామలాకుమారి, ఏపీవో హరనాథరావు తదితరులు పాల్గొన్నారు.

మెంటాడ: మండలంలోని లోతుగెడ్డ, ఆండ్ర గ్రామాల్లోని చేపడుతున్న ఫారంపాండ్‌ల నిర్మాణ పనులను ఏపీవో చిన్నప్పయ్య శనివారం ప్రారంభించారు. భూగర్భజలాల సంరక్షణే ప్రధానంగా ప్రభుత్వం ఈ ఫారంపాండ్‌ల నిర్మాణం జరుగుతోందని ఆయన అన్నారు.

బొబ్బిలిరూరల్: మండలంలోని కుమందానపేట మామిడితోటలో ఫారంపాండ్‌ల నిర్మాణ పనులను ఎంపీడీవో పి.రవికుమార్ శనివారం పరిశీలించారు.

రేగిడి: మండలంలోని కాగితాపల్లి, పారంపేట తదితర గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఎంపీడీవో శ్యామలాకుమారి శనివారం పరిశీలించి, పలు సూచనలు చేశారు. వేసవి ఎండల నేపథ్యంలో వడదెబ్బ బారినపడకుండా జాగ్రత్త వహించాలన్నారు. రోజుకు రెండు పూటలా చల్లగా ఉన్న సమయాల్లో పనులు చేసుకోవాలని, నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేస్తే గిట్టుబాటు అయ్యే వేతనం లభిస్తుందన్నారు. పని ప్రదేశంలో తాగునీరు, టెంట్లు, ప్రథమ చికిత్స కిట్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

కష్టపడ్డాం.. కూలి డబ్బులు ఇవ్వరా?



కష్టపడి పనిచేశాం.. కూలి డబ్బులు ఇవ్వరా అని రామభద్రపురం మండలం, నాయుడువలస గ్రామ వేతనదారులు బతిమలాడుతున్నారు. 10 వారాల పాటు ఊరిలో ఉపాధి హామీ పథకం పనులు చేసినా ఇంతవరకు తమకు డబ్బులు ఇవ్వలేదని కె.సింహాచలం, పి.గంగమ్మ, సీహెచ్ గంగమ్మ, జె.సంజీవి, జె.పైడితల్లి, సీహెచ్ గురువులు, ఎన్.రాజులు.. శనివారం 'సాక్షి' వద్ద వాపోయారు. రోజువారీ కూలిపై ఆధారపడి పొట్ట నింపుకునే తమకు ఇలా నెలల తరబడి డబ్బులు ఇవ్వకపోతే ఎలా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే తమ ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మండల వ్యాప్తంగా 2,350 మంది వేతనదారులు ఉపాధి పనులు చేస్తుండగా, ఇప్పటివరకు రూ.25 లక్షల పైబడి వేతనాలు బకాయిగా పడి ఉన్నట్లు సమాచారం. – రామభద్రపురం

బిల్లులు చెల్లించాలనడం దారుణం



ఇన్నాళ్లు ఇచ్చిన ఫ్రీ కరెంట్‌కు కూడా బిల్లులు చెల్లించాలని విద్యుత్ శాఖ అధికారులు అడుగుతుండడం దారుణమని వంగర మండలం, పటువర్ధనం ఎస్సీ వీధి వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయమై వారు ఆ గ్రామంలో శనివారం నిరసనకు దిగారు. 200 యూనిట్ల వరకు విద్యుత్ వినియోగించే ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఉచిత విద్యుత్‌ను గత ప్రభుత్వాలు అమలు చేశాయి. ఈ మేరకు తామంతా గడిచిన 12 ఏళ్లలో ఎటువంటి విద్యుత్ బిల్లులు చెల్లించలేదని, ఇప్పుడు ఉన్నట్టుండి మొండి బకాయిలు కూడా ఒకేసారి చెల్లించాలని అధికారులు ఒత్తిడి తీసుకురావడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. ఉచిత విద్యుత్ పథకాన్ని కొనసాగించాలని, ప్రభుత్వం తక్షణమే స్పందించి తమ వద్ద నుంచి కరెంట్ బిల్లుల వసూళ్లను నిలిపివేయాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యజ్జల రాము, తదితరులు పాల్గొన్నారు. – వంగర

పోక్సో చట్టంపై అవగాహన తప్పనిసరి



పోక్సో చట్టంపై అవగాహన తప్పనిసరి అని సీనియర్ సివిల్ జడ్జి కె.శారదాంబ అన్నారు. రాజాం ఎంపీడీవో కార్యాలయంలో శనివారం జరిగిన న్యాయవిజ్ఞాన సదస్సుకు హాజరైన ఆమె.. పోక్సో చట్టం గూర్చి వివరించారు. 18 ఏళ్ల వయసు లోపు పిల్లలపై లైంగిక దాడులు జరుగుతుండడం బాధాకరమన్నారు. బాలికలకు రక్షణ కల్పించే విధంగా 2012లో భారత ప్రభుత్వం ఈ చట్టాన్ని తీసుకువచ్చిందని, ఎవరైనా మైనరు బాలికలపై లైంగికదాడులకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన శిక్షలు అనుభవించాల్సి ఉంటుందన్నారు. నేరం జరిగితే విషయం బయటకు చెప్పడానికి ఇష్టపడని వారు టోల్‌ఫ్రీ నంబర్ 1098ను సంప్రదించాలని కోరారు. – రాజాం సిటీ

డంపింగ్ యార్డుల నిర్మాణం



బొబ్బిలిరూరల్: డంపింగ్ యార్డు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో రవికుమార్



రాజాం సిటీ: చెత్తను వేరుచేసే విధానం వివరిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

బొబ్బిలిరూరల్: మండలంలోని జగన్నాథపురంలో డంపింగ్ యార్డుల నిర్మాణం శనివారం ప్రారంభించారు. ఆ పనులను పరిశీలించిన ఎంపీడీవో పి.రవికుమార్.. స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మొత్తం మూడు నిర్మాణాలు చేస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో ఇంటింటి నుంచి సేకరించిన చెత్తను ఇక్కడికి తరలించి, సేంద్రియ ఎరువు తయారు చేయనున్నామన్నారు.

రాజాం సిటీ: మండలంలోని సోపేరు గ్రామంలో చెత్త సేకరణ, చెత్త నుంచి సంపద తయారీపై శనివారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వి.శ్రీనివాసరావు, సంతకవిటి ఈవోపీఆర్‌డీ ఎస్.రఘునాధాచారి తదితరులు పాల్గొన్నారు.

జీవకోటికి నీరే ప్రాణాధారం

ప్రపంచ జల దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులంతా కార్యక్రమానికి హాజరై, నీటి ఆవశ్యకతను ప్రజలకు వివరించారు. నీరే జీవకోటికి ప్రాణాధారమని, అటువంటి నీటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రతి నీటిబొట్టును ఒడిసిపడదాం.. భవిష్యత్ తరాల గొంతు తడుపుదాం.. ప్రతిజ్ఞ పూనుదాం.. నీటిని సంరక్షించుకుందాం.. అని నినాదాలు చేశారు. అనంతరం అవగాహన ర్యాలీలు చేపట్టి, జల సంరక్షణ ప్రతిజ్ఞ అందరితో చేయించారు.

– రాజాం సిటీ, బొబ్బిలి రూరల్, మెంటాడ



బొబ్బిలిరూరల్: పెంట గ్రామంలో జల సంరక్షణపై అవగాహన కల్పిస్తూ విద్యార్థుల ప్రదర్శన



మెంటాడ: మండల కేంద్రంలో అవగాహన ర్యాలీలో ఎంపీడీవో భానుమూర్తి తదితరులు



రాజాం సిటీ: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద అవగాహన ర్యాలీ చేపడుతున్న సిబ్బంది

సంక్షిప్తంగా...

దాతల సాయంతో ప్రహరీ నిర్మాణం

రాజాం: మండలంలోని బొద్దాం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి గ్రామస్తులు సహకరిస్తున్నారు. ప్రస్తుతం దాతలు అందించిన ఆర్థికసాయంతో పాఠశాల ప్రహరీ నిర్మాణ పనులు చేపడుతున్నారు. పాఠశాల ప్రగతికి దాతలు ముందుకు వస్తుండడం అభినందనీయమని ప్రధానోపాధ్యాయురాలు హైమావతి తెలిపారు.

ఘనంగా రామయ్య తండ్రి సంబరాలు

సంతకవిటి: మండలంలోని మందరాడ గ్రామంలో రామయ్య తండ్రి సంబరాలు శనివారం ఘనంగా నిర్వహించారు. కళాకారుల ప్రదర్శనల నడుమ దేవుని తిరువీధి చేపట్టారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం దేవుడిని తోడ్కొని వెళ్లే కార్యక్రమం చేపట్టారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

బొబ్బిలి: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వార్డు సభలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి శనివారం ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పీ-4 సర్వే ద్వారా అట్టడుగున ఉండే 20 శాతం నిరుపేదలను గుర్తించామని, ఇంకా ఎవరైనా అలాంటి వారు మిగిలి ఉంటే వారు వార్డుల వారీగా నిర్వహించే సభల ద్వారా గుర్తిస్తామన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై సమీక్ష

సంతకవిటి: మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో ఏవో పైల నవీన్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై సమీక్ష శనివారం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం డీపీఎం ఆనందరావు.. ప్రకృతి సాగు ఏ విధంగా జరుగుతుందన్న విషయంపై సిబ్బందిని ఆరాతీశారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు ఇచ్చే ప్రకృతి సాగును రైతులంతా అవలంబించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం టి.దధికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మద్యంసీసాలు స్వాధీనం

బాడంగి: మండలంలోని కోటిపల్లి గ్రామంలో అక్రమంగా విక్రయిస్తున్న 20 మద్యంసీసాలను శనివారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి, ఓ వ్యక్తిపై కేసు నమోదు చేశామన్నారు.

ప్రాచీన ఆలయాలను సంరక్షించుకోవాలి

సంతకవిటి: ప్రాచీన ఆలయాలను సంరక్షించుకోవాలని టీటీడీ ప్రధానార్చకులు గోవింద దీక్షితులు కోరారు. మండలంలోని గుళ్లసీతారాంపురంలోని 500 ఏళ్ల చరిత్ర కలిగిన పురాతన సీతారాముల ఆలయాన్ని ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ విశిష్టతను ఆలయ ప్రధానార్చకుడు భోగాపురపు ప్రసాదరావు తెలిపారు.

గిట్టుబాటు ధర కల్పించండి

బొబ్బిలి: రైతుల పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ ప్రభుత్వాన్ని కోరారు. ఇదే విషయమై స్థానిక పట్టణంలో ఓ కార్యక్రమానికి శనివారం హాజరైన ఆయన.. కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయన్నారు. ఏ ప్రభుత్వమూ ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదన్నారు. కార్మికులకు కనీస వేతనం ఇవ్వడం లేదన్నారు. ఆయన వెంట ఆ పార్టీ కార్యదర్శి వర్గ సభ్యుడు పొట్నూరు శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరచాలి

రేగిడి: విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరచాలని ఎంఈవో ఎంవీ ప్రసాదరావు సూచించారు. మండలంలోని ఆమదాలవలస గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆయన శనివారం ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాల రికార్డులు, సిబ్బంది, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం వంటకాలను పరిశీలించారు. అనంతరం తరగతుల వారీగా విద్యార్థుల వద్దకు వెళ్లి, వివిధ ప్రశ్నల ద్వారా వారి అభ్యసన సామర్థ్యాలు అంచనా వేశారు. చదువులో వెనబడిన విద్యార్థుల విద్యాప్రగతిపై దృష్టిసారించాలని సిబ్బందికి తెలిపారు.

బెట్టింగ్‌లకు పాల్పడితే కేసులు

బొబ్బిలి: ఐపీఎల్(ఇండియన్ ప్రీమియర్ లీగ్) పోటీలు ప్రారంభమయ్యాయని, ఎవరైనా బెట్టింగ్‌లకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని సీఐ కె.సతీష్‌కుమార్ హెచ్చరించారు. ఇదే విషయమై ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. సులభంగా డబ్బులు సంపాదించవచ్చన్న ఉద్దేశంతో కొంతమంది బెట్టింగ్‌లు ఆడుతున్నారని, అయితే చాలామంది నష్టపోతున్నారని తద్వారా వారి కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బెట్టింగ్‌లు ఆన్‌లైన్‌లో ఆడినా ఆఫ్‌లైన్‌లో ఆడినా నేరమేనని, ఆడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

నిషేధిత పాలిథిన్ కవర్లు వినియోగిస్తే చర్యలు

రాజాం సిటీ: నిషేధిత పాలిథిన్ కవర్లు వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు ఓ ప్రకటనలో శనివారం హెచ్చరించారు. 120 మైక్రాన్‌ల కన్నా తక్కువ మందం కలిగిన పాలిథిన్ కవర్లను నిషేధించామని, వాటిని ఎవరూ విక్రయించవద్దు.. వినియోగించవద్దన్నారు. ప్లాస్టిక్ టీ కప్పులు, స్ట్రాలు, ఐస్‌క్రీమ్ స్టిక్‌లు నిషేధంలో ఉన్నాయన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే రూ.5 వేల అపరాధ రుసుం విధించడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు.

ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలి

బొబ్బిలిరూరల్: విద్యార్థులంతా ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకుని, వాటిని చేరుకునేందుకు కృషి చేయాలని బొబ్బిలి డీఎస్పీ జి.భవ్యరెడ్డి సూచించారు. మండలంలోని కోమటిపల్లి గ్రామంలో ఉన్న భాస్కర ఫార్మసీ కళాశాలలో శనివారం జరిగిన ఫార్మ్ అభ్యుదయ్–2025 వేడుకలకు ముఖ్య అతిథిగా ఆమె హాజరై, ప్రసంగించారు. ప్రస్తుత కాలంలో యువత, విద్యార్థులంతా ఫ్యాషన్ మాయలో పడి చెడు వ్యసనాలకు బానిసలవుతున్నారన్నారు. మంచి అలవాట్లు అలవర్చుకుని, జీవితంలో బాగుపడాలనే కోరిక బలంగా నాటుకుపోవాలన్నారు. అనంతరం క్రీడాపోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.